సాక్షి
విశాఖపట్నం
శుక్రవారం । 11 । జూలై । 2025

● సాయినాథుడికి 'మధుర' నివేదన

శిష్యుల్లో అజ్ఞానాంధకారాన్ని తొలగించి, జ్ఞానజ్యోతిని వెలిగించే గురువును భక్తిశ్రద్ధలతో పూజించే పర్వదినం గురు పూర్ణిమ. ఈ సందర్భంగా సమర్థ సద్గురు సాయినాథుడికి నగరవ్యాప్తంగా గురువారం విశేష పూజలు చేశారు. ఈస్ట్‌పాయింట్ కాలనీలోని సాయిబాబా మందిరాన్ని పుష్పాలతో నేత్రపర్వంగా అలంకరించి, వందలాదిగా స్వీట్లు, పండ్లు నివేదించారు.

– ఫొటో : సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం



న్యూస్‌రీల్

కేసుల రాజీతో బహుళ ప్రయోజనాలు

జిల్లా ప్రధాన న్యాయమూర్తి చిన్నంశెట్టి రాజు



విశాఖ లీగల్ : పౌర శిక్షాస్మృతి పరిధిలోని కేసులను రాజీ చేసుకుంటే బహుళ ప్రయోజనాలు పొందవచ్చని జిల్లా ప్రధాన న్యాయమూర్తి చిన్నంశెట్టి రాజు అన్నారు. గురువారం విశాఖ జిల్లా కోర్టు ప్రాంగణంలోని న్యాయ సేవా ప్రాధికార సంస్థ కార్యాలయంలో గతంలో శిక్షణ పొందిన మధ్యవర్తుల న్యాయవాదుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పౌర శిక్షాస్మృతి పరిధిలోని సెక్షన్ 89 ప్రకారం రాజీ కలిగిన సివిల్ కేసులో ప్రాథమిక దశలోనే మధ్యవర్తిత్వానికి పంపించడం జరుగుతుందన్నారు. రాజీకి వచ్చిన కేసులను న్యాయవాదులు మధ్యవర్తిత్వం ద్వారా లబ్ధి చేకూర్చే విధంగా పరిష్కరించే మార్గాలను కక్షిదారులకు వివరించాలన్నారు. న్యాయ సేవా ప్రాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు మాట్లాడుతూ మధ్యవర్తిత్వం ద్వారా కేసులు రాజీ అయితే బాధితుడు చెల్లించిన కోర్టు ఫీజు తిరిగి ఇవ్వడం జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో నగర పరిధిలోని శిక్షణ పొందిన న్యాయవాదులు, న్యాయమూర్తులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ రాష్ట్ర మున్సిపల్ విభాగ కమిటీలో ముగ్గురికి చోటు

అల్లిపురం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మున్సిపల్ విభాగ కమిటీలో విశాఖ జిల్లాకు చెందిన ముగ్గురికి చోటు దక్కింది. కమిటీలో జనరల్ సెక్రటరీగా గుడ్ల వెంకట రమణి రెడ్డి (విశాఖ ఉత్తర), కార్యదర్శులుగా అక్కరమాని రోహిణి (విశాఖ తూర్పు), కోడిగుడ్ల పూర్ణిమ (విశాఖ దక్షిణం) నియమితులయ్యారు. ఈ మేరకు మాజీ సీఎం, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం ఒక ప్రకటన విడుదల చేసింది.

కలెక్టర్‌తో మేఘాలయ పీఏసీ బృందం భేటీ



జిల్లా కలెక్టర్‌ను కలిసిన మేఘాలయ పబ్లిక్ అకౌంట్స్ కమిటీ బృందం

మహారాణిపేట: స్టడీ టూర్ నిమిత్తం జిల్లాకు చేరుకున్న మేఘాలయ రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ(పీఏసీ) బృంద సభ్యులు గురువారం సాయంత్రం మర్యాదపూర్వకంగా జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్‌ను ఆయన చాంబర్లో కలిశారు. ఈ క్రమంలో వివిధ అంశాలపై చర్చించారు. ఈ బృందం జిల్లాలో మూడు రోజుల పాటు పర్యటించనుంది. విశాఖ పోర్ట్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రాజెక్టులు, ఇతర అంశాలను క్షేత్రస్థాయిలో సభ్యులు పరిశీలిస్తారు. పోర్ట్, క్రూయిజ్, లాంజ్ తదితర ప్రాంతాలను సందర్శిస్తారు. జిల్లా పర్యటన అనంతరం 12న వారు భువనేశ్వర్ బయల్దేరతారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో కమిటీ చైర్మన్, ఆ రాష్ట్ర ప్రజా ప్రతినిధులు, అధికారులు, సలహాదారులు ఉన్నారు.

ఈపీడీసీఎల్ ఈఈలకు స్థాన చలనం

సాక్షి, విశాఖపట్నం : ఏపీఈపీడీసీఎల్ పరిధిలో విధులు నిర్వర్తిస్తున్న ఇద్దరు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లను స్థానచలనం చేస్తూ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి ఉత్తర్వులు జారీ చేశారు. జోన్–1 ఆపరేషన్స్ ఈఈ బి.సింహాచలం నాయుడ్ని జోన్–3 ఆపరేషన్స్ ఈఈగా బదిలీ చేశారు. జోన్–3 ఆపరేషన్స్ ఈఈ పి.శ్రీనివాసరావును జోన్–1కి బదిలీ చేస్తూ సీఎండీ ఉత్తర్వులు జారీ చేశారు. ఆయా జోన్లలో మూడేళ్ల విధుల కాలపరిమితి పూర్తయిన నేపథ్యంలో ట్రాన్స్‌ఫర్ చేసినట్లు అధికారులు తెలిపారు.

శ్రీకాకుళం వరకే నేడు మెము రైలు

విశాఖ సిటీ: విశాఖ–పలాస మెము రైలు(67289) శుక్రవారం శ్రీకాకుళం వరకు మాత్రమే నడుస్తుందని వాల్తేరు డివిజన్ అధికారులు ప్రకటించారు. తిరుగు ప్రయాణంలో మెము(67290) పలాస నుంచి కాకుండా శ్రీకాకుళం నుంచి బయలుదేరి విశాఖకు చేరుకుంటుందని తెలిపారు.

కోరాపుట్ వరకు కిరండూల్ రైళ్లు

ఈ నెల 11 నుంచి 13 వరకు విశాఖ–కిరండూల్ నైట్ ఎక్స్‌ప్రెస్(18515) కోరాపుట్ వరకు మాత్రమే నడుస్తుందని పేర్కొన్నారు. తిరుగు ప్రయాణంలో (18516) ఈ రైలు కిరండూల్ నుంచి కాకుండా కోరాపుట్ నుంచి బయలుదేరి విశాఖకు చేరుకుంటుందన్నారు. విశాఖ–కిరండూల్ పాసింజర్(58501) కోరాపుట్ వరకు వెళుతుందని, అటు నుంచి వచ్చే రైలు కూడా కోరాపుట్ నుంచి బయలుదేరి విశాఖకు వస్తుందని వివరించారు.

స్వామీ.. నీ సన్నిధి చేరి..



రాజగోపురం వద్ద బాల శ్రీరాముడి నమూనా



తొలి పావంచాకి చేరుకుంటున్న.. తొలిపావంచా నుంచి తమ ఇళ్లకు తిరుగు పయనం అవుతున్న భక్తులు

- అచంచల భక్తితో గిరి ప్రదక్షిణ పూర్తి చేసిన భక్తులు
- పౌర్ణమి వేళ విశేషంగా ఆలయ ప్రదక్షిణలు
- లక్షలాదిగా తరలివచ్చిన భక్త జన సందోహం
- నృసింహుని స్మరణతో మార్మోగిన గిరి మార్గం



తొలిపావంచా వద్ద రోడ్డుపైనే కొబ్బరికాయలు కొడుతున్న భక్తులు



వంతెనపై నుంచి వెళ్తున్న ఆలయ ప్రదక్షిణ భక్తులు, కింద నుంచి దర్శనానికి వెళ్తున్న భక్తులు

సింహాచలం: ఆషాఢ శుద్ధ చతుర్దశి పురస్కరించుకుని జరిగిన సింహగిరి ప్రదక్షిణ మహోత్సవం గురువారంతో దిగ్విజయంగా ముగిసింది. శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని స్మరిస్తూ బుధవారం చేపట్టిన 32 కిలోమీటర్ల గిరి ప్రదక్షిణ అశేష జన సందోహంతో కొనసాగింది. సింహాచలంలోని తొలి పావంచా వద్ద ప్రదక్షిణ ప్రారంభించిన భక్తులు సింహగిరి చుట్టూ ప్రదక్షిణ చేసి తిరిగి తొలిపావంచా వద్దకు చేరుకున్నారు. అక్కడ స్వామి సన్నిధిలో కొబ్బరికాయ కొట్టి తమ ప్రదక్షిణను ముగించారు. పలువురు భక్తులు సింహగిరికి వెళ్లి స్వామిని దర్శించుకున్నారు.

సింహగిరిపై జన జాతర

ఒక పక్క 32 కిలోమీటర్లు గిరి ప్రదక్షిణ చేసి స్వామి దర్శనానికి వచ్చిన భక్తులు.. మరో పక్క ఆలయ ప్రదక్షిణలకు వచ్చిన భక్తులతో గురువారం సింహగిరి భక్త జనజాతరగా మారింది. దేవస్థానం అంచనాల ప్రకారం.. ఈ సారి గిరి ప్రదక్షిణలో సుమారు 8 లక్షల మంది భక్తులు పాల్గొన్నారు. గురువారం ఒక్క రోజే 68 వేల మంది భక్తులు సింహగిరిపై స్వామిని దర్శించుకోగా, బుధవారం 42 వేల మంది దర్శనం చేసుకున్నారు. అలాగే సుమారు 5 వేల మంది భక్తులు ఆలయ ప్రదక్షిణల్లో పాల్గొన్నారు.

తెల్లవారుజాము నుంచే దర్శనాలు

గిరి ప్రదక్షిణ చేసి సింహగిరికి వచ్చిన భక్తుల సౌకర్యార్థం దేవస్థానం అధికారులు గురువారం తెల్లవారుజామున 3.30 గంటల నుంచే స్వామి దర్శనాలకు అనుమతించారు. తొలుత ఉదయం 5.30 గంటల నుంచి దర్శనాలు కల్పిస్తామని ప్రకటించినప్పటికీ.. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నారు. అక్కడి నుంచి మధ్యాహ్నం 3.30 గంటల వరకు భక్తులకు దర్శనాలు కల్పించారు. భక్తులకు త్వరితగతిన దర్శనం కల్పించే ఉద్దేశంతో ఉదయం 4.30 గంటల నుంచి రూ.100, రూ.300 టికెట్ల క్యూల్లో కూడా భక్తులను ఉచితంగా పంపించారు. ఆలయ నీలాద్రి గుమ్మం దగ్గర నుంచే లఘు దర్శనం కల్పించి, అంతరాలయ దర్శనాన్ని నిలిపివేశారు.

విశేషంగా ఆలయ ప్రదక్షిణలు

ఆషాఢ పౌర్ణమిని పురస్కరించుకుని సింహగిరిపై గురువారం ఆలయ ప్రదక్షిణలు ఘనంగా జరిగాయి. తెల్లవారుజామున 3 గంటల నుంచే భక్తులను ఆలయ ప్రదక్షిణలకు అనుమతించారు.



పాపను ఎత్తుకుని దర్శనానికి వస్తున్న భక్తుడు



భక్తురాలి కాలికి మర్దన చేస్తున్న స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు



గిరి ప్రదక్షిణ చేసి మెట్లమార్గంలో సింహగిరికి వస్తున్న భక్తులు

ముఖ్యాంశాలు

- కొండ దిగువ పాత గోశాల జంక్షన్ నుంచి పాత అడవివరం వరకు ఉన్న మార్గం భక్తులతో కిక్కిరిసింది. గిరి ప్రదక్షిణ పూర్తి చేసి తొలిపావంచాకు చేరుకునే భక్తులు, ప్రదక్షిణ పూర్తి చేసుకుని ఇళ్లకు చేరుకునే భక్తులతో రద్దీ నెలకొంది.
- గిరి ప్రదక్షిణ ముగించుకుని కొబ్బరికాయలు కొట్టే భక్తులతో తొలిపావంచా గురువారం మధ్యాహ్నం వరకు కిటకిటలాడింది.
- మెట్ల మార్గంలో కేవలం సింహగిరికి వెళ్లే భక్తులను మాత్రమే అనుమతించారు. కొండ దిగువకు మెట్ల మార్గంలో అనుమతించలేదు.
- సింహగిరి నుంచి దిగువకు, దిగువ నుంచి కొండ పైకి దేవస్థానం 50 ఉచిత బస్సులను నడిపింది.
- 32 కిలోమీటర్ల ప్రదక్షిణ చేసి సింహగిరి వచ్చిన భక్తులను ఆలయ ఉత్తర రాజగోపురం వద్ద ఏర్పాటు చేసిన వంతెన కింద నుంచి దర్శనానికి, దక్షిణ రాజగోపురం వద్ద ఏర్పాటు చేసిన వంతెన దిగువ నుంచి దర్శన అనంతరం బయటకు పంపించారు.
- ఆలయ నీలాద్రి గుమ్మం వద్ద నాలుగు లైన్లలో ర్యాంపులు ఏర్పాటు చేసి దర్శనాలు కల్పించారు.
- సింహగిరిపై అడవివరం ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు.
- భక్తులు కొట్టిన కొబ్బరికాయలతో తొలి పావంచా వద్ద పెద్ద ఎత్తున కుప్ప ఏర్పడింది.
- సింహగిరిపై అన్నప్రసాద భవనంలో కదంబం, దద్దోజనం ప్రసాదాన్ని భక్తులకు అందజేశారు.
- సింహగిరిపై బస్టాండ్‌లో తీవ్ర రద్దీ నెలకొంది. కొండ దిగువకు వెళ్లే ఆర్టీసీ బస్సులన్నీ భక్తుల రద్దీతో నిండిపోయాయి. అలాగే కొండ దిగువ పాతగోశాల జంక్షన్ వద్ద తీవ్ర రద్దీ నెలకొంది.
- తొలిపావంచా వద్ద పబ్లిక్ అడ్రసింగ్ సిస్టం వద్దకు వచ్చిన చాలా మంది భక్తులు తమ బంధువులు కనిపించడం లేదని పోలీసుల సహాయం కోరారు.
- సెల్‌ఫోన్ సిగ్నల్స్ సరిగా లేకపోవడంతో భక్తులు ఇబ్బందులు పడ్డారు.
- గిరి ప్రదక్షిణ చేసిన చాలా మంది భక్తులు అడవివరంలోని తొలిపావంచా వద్ద మెట్లపై, రహదారి పక్కన ఉన్న ఖాళీ ప్రదేశాల్లో, పలు కల్యాణ మండపాల హాళ్లలో నిద్రించి, ఆ తర్వాత తమ గ్రామాలకు తరలివెళ్లారు.



స్వామి దర్శనానికి గురువారం తెల్లవారుజామున క్యూలో వేచి ఉన్న గిరి ప్రదక్షిణ భక్తులు

ఆంక్షలతో భక్తులకు నరకం
ఘనంగా ఢిల్లీ విజయోత్సవం
– 8లో

రైల్వే స్టేషన్‌లో క్యాప్సూల్ హోటల్

- పీపీపీ విధానంలో అభివృద్ధి.. అందుబాటులోకి 88 క్యాప్సూల్ బెడ్లు
- 3 గంటల వరకు రూ.200, రోజుకు రూ.400 వసూలు
- రైలు ప్యాసింజర్లతో పాటు బయట వారు వినియోగించుకునే సౌకర్యం
- డిమాండ్‌ను బట్టి మరిన్ని స్టేషన్లలో ఏర్పాటుకు ఆలోచన
- వాల్తేరు డీఆర్‌ఎం లలిత్ బొహ్రా





మాట్లాడుతున్న డీఆర్‌ఎం లలిత్ బొహ్రా

విశాఖ సిటీ : విశాఖ రైల్వేస్టేషన్‌లో సరికొత్త సౌకర్యం అందుబాటులోకి వచ్చింది. ప్రయాణికుల సౌకర్యార్థం కొత్తగా క్యాప్సూల్ హోటల్ సిద్ధమైంది. పబ్లిక్ ప్రైవేట్ పార్ట్నర్‌షిప్(పీపీపీ) విధానంలో ప్లాట్‌ఫాం నెంబర్–1, గేట్ నెంబర్–3 వద్ద మొదటి అంతస్తులో ఏర్పాటు చేశారు. ఈస్ట్ కోస్ట్ రైల్వే జోన్ పరిధిలోనే తొలిసారిగా ఈ తరహా క్యాప్సూల్ హోటల్‌ను విశాఖలోనే అందుబాటులోకి తీసుకొచ్చామని వాల్తేరు డివిజనల్ రైల్వే మేనేజర్ లలిత్ బొహ్రా తెలిపారు. గురువారం డీఆర్‌ఎం చాంబర్‌లో జరిగిన మీడియా సమావేశంలో ఆయన చెప్పిన వివరాల ప్రకారం.. రైల్వే స్టేషన్‌లో వసతి సౌకర్యాలకు మంచి డిమాండ్ ఉంది. ప్రస్తుతం స్టేషన్‌లో ఉన్న రిటైరింగ్ రూమ్స్ సరిపోక ప్రయాణికులు బయట హోటల్స్‌కు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో రైలు ప్రయాణికులకు, పర్యాటకులకు అందుబాటు ధరలో సౌకర్యవంతమైన వసతి కల్పించాలన్న ఉద్దేశంతో సరికొత్తగా క్యాప్సూల్ హోటల్‌ను ఏర్పాటు చేశారు. ఈ తరహా హోటల్స్ ప్రస్తుతం ముంబై, హైదరాబాద్ వంటి రైల్వేస్టేషన్లలో మాత్రమే ఉన్నాయి.

పీపీపీ విధానంలో అభివృద్ధి

విశాఖ రైల్వే స్టేషన్‌లో కూడా ఆధునిక హంగులు, అందుబాటు ధరలతో క్యాప్సూల్ హోటల్‌ను ఏర్పాటు చేయాలని అధికారులు నిర్ణయించారు. పీపీపీ విధానంలో ఈ ప్రాజెక్టును చేపట్టేందుకు ఈ–ఆక్షన్ నిర్వహించారు. ఇందులో శ్రీ మహాలక్ష్మి ఏజెన్సీ అనే సంస్థ ఐదేళ్ల కాలానికి ప్రాజెక్టును దక్కించుకుంది. రైల్వేస్టేషన్ మొదటి అంతస్తులో అధికారులు స్థలాన్ని కేటాయించారు. సదరు కాంట్రాక్టు సంస్థ ఇక్కడ క్యాప్సూల్ హోటల్‌ను అభివృద్ధి చేసింది. ఇందులో 73 సింగిల్ బెడ్లు, 15 డబుల్ బెడ్లు మొత్తంగా 88 బెడ్లను ఏర్పాటు చేసింది. మహిళల కోసం 18 బెడ్లు, ప్రత్యేక సౌకర్యాలు కల్పించింది. రైల్వే ప్రయాణికులతో పాటు పర్యాటకులు, బయట వ్యక్తులకు కూడా ఈ హోటల్‌లో వసతి పొందే సౌలభ్యాన్ని కల్పించారు.

3 గంటలలోపు రూ.200

ఈ కొత్త క్యాప్సూల్ హోటల్‌లో అన్ని రకాల సౌకర్యాలతో పాటు అనేక సదుపాయాలు కల్పించారు. అతిథులకు ఉచిత వైఫై, 24 గంటలు వేడి నీళ్ల సౌకర్యం, పర్యాటకుల కోసం ట్రావెల్ డెస్క్‌తో పాటు ఇన్‌హౌస్ స్నాక్ బార్‌ను ఏర్పాటు చేశారు. ఇందులో సింగిల్ బెడ్‌కు 3 గంటలలోపు రూ.200, 3 నుంచి 24 గంటల వరకు రూ.400 వసూలు చేయనున్నారు. అలాగే డబుల్ బెడ్‌కు మూడు గంటలలోపు రూ.300, 3 నుంచి 24 గంటలలోపు అయితే రూ.600 చెల్లించాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఆన్‌లైన్ ద్వారా ఈ బెడ్స్‌ను బుక్ చేసుకునే సదుపాయం లేదని డీఆర్‌ఎం తెలిపారు. డిమాండ్‌ను బట్టి ఆ సదుపాయాన్ని కూడా అందుబాటులోకి తీసుకొస్తామని చెప్పారు.

బొప్పికట్టిన బదిలీలలు

- అడ్డగోలుగా సచివాలయ ఉద్యోగుల బదిలీ ప్రక్రియ
- ఇష్టారాజ్యంగా పోస్టింగ్‌లు ఇచ్చేసిన అధికారులు
- ఉద్యోగంలో లేనివారికీ పోస్టింగ్‌లు
- ఒకే పోస్టింగ్‌కు ఇద్దర్ని బదిలీ చేసిన వైనం
- అడుగడుగునా కొట్టొచ్చిన అధికారుల అలసత్వం



సాక్షి, విశాఖపట్నం : 'ఈస్ట్ పాయింట్ కాలనీలోని సచివాలయ ఉద్యోగిని సుమారు రెండేళ్ల క్రితం ఉద్యోగానికి రాజీనామా చేసేశారు. ఆమెను మద్దిలపాలెం–2 సచివాలయానికి తాజాగా బదిలీ చేశారు.

'జోన్–3 గొల్లవీధి సచివాలయ ఉద్యోగి అఖిల్ సాయి మూడేళ్ల క్రితం విధుల నుంచి తప్పుకున్నారు. ఆయన్ని ఎంవీపీ కాలనీ–1కి బదిలీ చేశారు.

అలాగే 'గ్రేటర్ పరిధిలోని చాలా సచివాలయాల్లో ఒకే పోస్టుకు ఇద్దరు లేదా ముగ్గురికి పోస్టింగ్ ఇచ్చేశారు.'

ఇవి మచ్చుకు కొన్ని ఉదాహరణలు మాత్రమే. సుపరిపాలనకు వారధులుగా నిలిచిన సచివాలయ ఉద్యోగుల బదిలీల్లో అధికారుల నిర్లక్ష్యం అడుగడుగునా కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. ప్రభుత్వ ఉద్యోగుల బదిలీ విషయంలో పకడ్బందీగా వ్యవహరించాల్సిన వివిధ విభాగాధిపతులు, జీవీఎంసీ అధికారులు అడ్డగోలుగా వ్యవహరించారు. కౌన్సెలింగ్ ప్రక్రియ సరిగా నిర్వహించక.. పోస్టులు ఖాళీగా ఉన్న సచివాలయాల్ని గుర్తించినా.. వాటిని భర్తీ చేసే విషయంలో అలసత్వం ప్రదర్శించారు. ఫలితంగా ఉద్యోగులు గందరగోళానికి గురికావడంతోపాటు తీవ్రంగా నష్టపోయారు.

ఒక పోస్టుకు ఇద్దరేసి బదిలీ..!

గ్రేటర్ పరిధిలో దాదాపు 40 సచివాలయాల్లో వింత బదిలీలు జరిగాయి. ఒక్కో పోస్టుకు ఇద్దరు లేదా ముగ్గుర్ని బదిలీ చేసిన విషయాలు కూడా బహిర్గతమయ్యాయి. ఆ పోస్టుకు తనని బదిలీ చేశారంటే.. తనని చేశారంటూ ఉద్యోగుల మధ్య వాగ్వాదాలు కూడా జరగడం గమనార్హం. విషయం తెలుసుకునేందుకు అధికారుల దగ్గరికి వెళ్తే.. అప్పటికే తమలాంటి బాధితులు పదుల సంఖ్యలో సదరు అధికారుల ఛాంబర్ల వద్ద పడిగాపులు కాస్తున్న విషయం తెలుసుకొని అవాక్కయ్యారు.

ఖాళీలున్న చోట మాత్రం..!

ఒక పోస్టుకు ఇద్దరు చొప్పున బదిలీ చేసిన అధికారులు.. ఖాళీలున్న సచివాలయాల్లో మాత్రం ఎవరికీ పోస్టింగ్‌లు ఇవ్వకపోవడం కొసమెరుపు. వార్డు కార్యదర్శుల పోస్టులు జీవీఎంసీ పరిధిలో చాలా చోట్ల ఖాళీలు చూపించారు. రేషనలైజేషన్ ప్రక్రియ ప్రకారం ఖాళీ చూపించిన ప్రతి సచివాలయంలోనూ పోస్టును భర్తీ చేయాల్సి ఉంటుంది. కానీ అధికారులు అలసత్వం ప్రదర్శించడంతో ఆయా సచివాలయాల్లో ఇంకా వార్డు కార్యదర్శుల పోస్టులు ఖాళీగానే దర్శనమిస్తున్నాయి. ఈ లోపాలు, ఇబ్బందుల్ని కొంతమంది ఉద్యోగులు జిల్లా స్థాయి అధికారితో పాటు ఆయా విభాగాల అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలుస్తోంది. అయితే ఒకరు జీవీఎంసీ డేటా సరిగా ఇవ్వలేదని చెబుతుండగా.. జీవీఎంసీ అధికారులు మాత్రం బదిలీల ప్రక్రియలోనే తప్పులు దొర్లాయని ఒకరిపై ఒకరు నిందలు వేస్తున్నారు. తప్పు ఎవరు చేసినా బలలైంది తామేనంటూ సచివాలయ ఉద్యోగులు వాపోతున్నారు. రేషనలైజేషన్ ప్రక్రియ సరిగా నిర్వహించకపోవడంతో తాము కూడా నష్టపోయామంటూ దివ్యాంగ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సచివాలయ వ్యవస్థను నిర్వీర్యం చేసిన ప్రభుత్వం.. ఇప్పుడు ఉద్యోగుల బదిలీల విషయంలోనూ అదే వైఖరి కనబరుస్తోందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

లేనివారికి పోస్టింగ్‌లు..!

గ్రేటర్ పరిధిలో పలు సచివాలయాల్లో పనిచేస్తున్న కొంతమంది ఉద్యోగులు వేరే ఉద్యోగం రావడం, ఇతర కారణాలతో రాజీనామా చేసేశారు. విధుల్లో అలసత్వం వహిస్తున్నందున మరికొందరిని తొలగించారు. వీరి పేర్లు కూడా బదిలీ జాబితాల్లో దర్శనమివ్వడం ఆశ్చర్యకరమైన అంశం. జోన్–6 పరిధిలో నలుగురు వార్డ్ ఎమినిటీ సెక్రటరీలు వివిధ కారణాలతో రెండు మూడేళ్లుగా విధుల్లో లేరు. కానీ.. వీరికి నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న సచివాలయాలకు బదిలీ చేసినట్లు ఉత్తర్వులిచ్చేశారు. ఇలా విధుల్లో లేని వారికి కూడా బదిలీ చేయడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

పీటీఎంలో సమస్యల వెల్లువ

ఉపాధ్యాయులకు తల్లిదండ్రుల ఫిర్యాదు

ఆరిలోవ: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం జరిగిన పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ (పీటీఎం).. ఆయా పాఠశాలల్లోని డొల్లతనాన్ని బయటపెట్టింది. కూటమి ప్రభుత్వం ఎంతో ఆర్భాటంగా ఈ కార్యక్రమాన్ని తలపెట్టినా.. తల్లిదండ్రుల నుంచి ఆశించిన స్పందన లభించలేదు. హాజరైన కొద్దిమంది తల్లిదండ్రులు కూడా పాఠశాలల్లోని సమస్యలను ఏకరువు పెట్టారు. అపరిశుభ్రత, సౌకర్యాల కొరత, పాఠశాలల నిర్వహణ లోపాలు, అసాంఘిక శక్తుల విచ్చలవిడితనం వంటి అనేక అంశాలను ఉపాధ్యాయుల దృష్టికి తెచ్చారు. చంద్రంపాలెం ఉన్నత పాఠశాల ఆవరణలో రాత్రి వేళల్లో మత్తు పదార్థాలు సేవించే వారి సంచారం ఎక్కువైందని, ఉదయం పూట గంజాయి, ఖాళీ మద్యం సీసాలు కనిపిస్తున్నాయని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇది విద్యార్థులపై చెడు ప్రభావం చూపుతుందని, వెంటనే నివారణ చర్యలు చేపట్టాలని కోరారు. తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తాగునీటి సమస్య, అపరిశుభ్ర మరుగుదొడ్ల గురించి తల్లిదండ్రులు నేరుగా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. పెందుర్తి, గోపాలపట్నం, గాజువాక ప్రాంతాల్లోని పాఠశాలల్లో క్రీడా మైదానాలు, సరిపడా ఉపాధ్యాయులు లేరని ప్రధానోపాధ్యాయులకు విన్నవించుకున్నారు. దీంతో పీటీఎం కార్యక్రమానికి హాజరైన కూటమి నాయకులు కంగుతిన్నారు. రికార్డు సాధించాలని ఆశిస్తే, తల్లిదండ్రులు సమస్యలు చెప్పి పరువు తీస్తున్నారంటూ గుసగుసలాడుకోవడం కనిపించింది.

'ప్రైవేటు'లో తూతూమంత్రం

గిన్నీస్ రికార్డు కోసం ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలన్నింటిలోనూ పీటీఎంలను ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించినా.. చాలా ప్రైవేట్ సంస్థలు ఆ ఆదేశాలను పెడచెవిన పెట్టాయి. నామమాత్రంగా కార్యక్రమాన్ని నిర్వహించి చేతులు దులుపుకున్నాయి. చాలా ప్రైవేట్ పాఠశాలల్లో కేవలం 5 నుంచి 10 మంది తల్లిదండ్రులతోనే ఫొటోలు తీసి, వాటిని విద్యాశాఖ యాప్‌లో అప్‌లోడ్ చేశారు. కొన్ని జూనియర్ కళాశాలలు కేవలం గేటు ముందు సమావేశం జరుగుతుందని బోర్డు పెట్టి సరిపెట్టాయి. విశేషమేమిటంటే.. కూటమి ప్రభుత్వంలో కీలకపాత్ర పోషిస్తున్న మంత్రికి చెందిన నారాయణ విద్యాసంస్థలతో పాటు, శ్రీ చైతన్య విద్యాసంస్థల్లోనూ ఈ కార్యక్రమాన్ని మమ అనిపించేశారు. నిబంధనల ప్రకారం టెంట్లు వేసి, తల్లిదండ్రులకు ఆటల పోటీలు, సమావేశాలు నిర్వహించాల్సి ఉన్నా.. అతి తక్కువ సంఖ్యలో హాజరైన వారికి టీ, బిస్కెట్లు ఇచ్చి పంపించేశారు. ఆయా ప్రైవేట్ స్కూళ్లలోని ఏ బ్రాంచ్‌లోనూ ఆర్భాటంగా పీటీఎంలు నిర్వహించకపోవడం గమనార్హం. మిగిలిన ప్రైవేట్ పాఠశాలల్లోనూ ఇదే పరిస్థితి కనిపించింది.

● **చెట్ల కింద పేరెంట్స్.. నేలపై స్టూడెంట్స్**



మెగా పీటీఎంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కూటమి ప్రభుత్వం పేరెంట్స్ టీచర్ల మీటింగ్(పీటీఎం)ను ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని ఆదేశించినా.. నిధులు విడుదల చేయకపోవడంతో ఉపాధ్యాయులే తమ జేబుల నుంచి డబ్బులు వెచ్చించి అరకొర ఏర్పాట్లు చేశారు. ఇందుకు క్వీన్ మేరీస్ స్కూల్‌లో జరిగిన పీటీఎం నిదర్శనం. చెట్ల కింద తల్లిదండ్రులను, నేలపై విద్యార్థులను కూర్చోబెట్టారు. స్కూల్ ఆవరణలో మట్టి దుమ్ము రేగడంతో విద్యార్థులు అసౌకర్యానికి గురయ్యారు. దీంతో అక్కడి సిబ్బంది దుమ్ము లేవకుండా నీళ్లు చల్లాల్సి వచ్చింది. అంతేకాకుండా మధ్యాహ్న భోజన సమయంలో విద్యార్థులతోనే వంట సామగ్రిని మోయించడం గమనార్హం. – సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

పిల్లల లక్ష్య సాధనలో తల్లిదండ్రుల తోడ్పాటు అవసరం



మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

ఆరిలోవ: పిల్లల లక్ష్య సాధనలో తల్లిదండ్రుల తోడ్పాటు అవసరమని కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ అన్నారు. తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం జరిగిన మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్(పీటీఎం)లో ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబుతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పిల్లలకు తల్లిదండ్రులే తొలి గురువులని, తల్లిదండ్రుల అలవాట్లు, నడవడిక పిల్లలపై ప్రభావం చూపుతుందన్నారు. పిల్లల కోసం ప్రతి రోజూ కొంత సమయం కేటాయించాలని సూచించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో కలసి విద్యార్థులు బంగారు భవిష్యత్‌కు బాటలు వేయాలన్నదే పీటీఎం ఉద్దేశమన్నారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థుల లక్ష్యాలు, వారి శక్తి సామర్థ్యాల గురించి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లలపై ప్రేమతో మెలగాలన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం దుర్గాభవాని, కార్పొరేటర్ మద్దిల రామలక్ష్మి, మాజీ కార్పొరేటర్ ఒమ్మి సన్యాసిరావు, స్థానిక నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విచారణాధికారి మార్పు

దాబాగార్డెన్స్: గాజువాక జోనల్ కమిషనర్, ఆ జోన్ టౌన్ ప్లానింగ్ అధికారులు, సిబ్బందిపై చేపట్టిన విచారణకు సంబంధించి ఏసీబీ ఇన్‌స్పెక్టర్‌ను మారుస్తూ మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్‌కుమార్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. 63వ వార్డులో చేపడుతున్న నిర్మాణంపై ఫిర్యాదు రావడంతో ఏసీబీ అధికారులు 2017లో దాడి చేసిన విషయం తెలిసిందే.

అప్పటి జోనల్ కమిషనర్ బీవీ రమణతో పాటు టౌన్ ప్లానింగ్ అధికారులు (ఏసీపీలు) హరిదాస్, నాయుడు, వెంకటరమణ, టీపీఎస్ వరప్రసాద్, డీసీపీలు మీనాకుమారి, రాంబాబు, టీపీవోలు వెంకటేశ్వరరావు, ఎల్లారెడ్డి, మరో జోన్ జోనల్ కమిషనర్ సోమన్నారాయణతో పాటు చైన్‌మెన్ వెంకటేశ్వరరావుపై అభియోగాలు నమోదయ్యాయి. అందుకు సంబంధించి విచారణాధికారులుగా టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ సంయుక్త సంచాలకుడు సురేష్‌కుమార్, ఏసీబీ ఇన్‌స్పెక్టర్ ప్రేమ్‌కుమార్‌ను నియమించారు. ఏసీబీ ఇన్‌స్పెక్టర్ ఆ విభాగం నుంచి బయటికి వెళ్లిపోవడంతో ఆయన స్థానంలో సీహెచ్ వెంకట్రావును విచారణాధికారిగా నియమించారు.

బీటెక్ సెల్ఫ్ ఫైనాన్స్ అభ్యర్థులకు ఫీజు గడువు పెంపు

మద్దిలపాలెం: బీటెక్ సెల్ఫ్ ఫైనాన్సింగ్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి అభ్యర్థుల అభ్యర్థనల దృష్ట్యా ఫీజు చెల్లింపు గడువును ఈ నెల 17 వరకు పొడిగించినట్లు ఏయూ డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ ఆచార్య డి.ఎ.నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. సెల్ఫ్ ఫైనాన్సింగ్‌లో రెండో దశలో సీటు పొందిన అభ్యర్థుల ఈ నెల 17వ తేదీ లేదా అంతకు ముందు ఫీజు చెల్లించవచ్చని పేర్కొన్నారు. అభ్యర్థి గడువులోగా ఫీజు చెల్లించకపోతే కేటాయించిన సీటు రద్దవుతుందని తెలిపారు.

ఆంక్షలతో భక్తులకు నరకం

- 42 కి.మీ.గా మారిన 32 కి.మీ. గిరి ప్రదక్షిణ
- అదనపు దూరం, ప్రత్యామ్నాయ రవాణా లేక భక్తుల ఆగ్రహం



ప్రదక్షిణ పూర్తి చేసి రవాణా సదుపాయం కోసం వేపగుంట వైపు నడిచి వెళ్తున్న భక్తులు

సింహాచలం: 32 కిలోమీటర్ల సింహాచలం గిరి ప్రదక్షిణ.. ట్రాఫిక్ ఆంక్షల కారణంగా దాదాపు 42 కిలోమీటర్లకు చేరిందని భక్తులు వాపోయారు. ప్రదక్షిణకు ముందు, ఆ తర్వాత కూడా కిలోమీటర్ల కొద్దీ నడవాల్సి రావడంతో నరకం చూశామని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నడూ లేని విధంగా అమలు చేసిన కఠిన నిబంధనలు.. భక్తుల సహనాన్ని పరీక్షించాయి.

గిరి ప్రదక్షిణ ప్రారంభించేందుకు బుధవారం సింహాచలం చేరుకున్న భక్తులకు పోలీసులు షాక్ ఇచ్చారు. వాహనాలను వేపగుంట, గోపాలపట్నం కూడళ్ల వద్ద అంటే కొండకు నాలుగైదు కిలోమీటర్ల దూరంలోనే నిలిపివేశారు. దీంతో అసలు 32 కిలోమీటర్ల ప్రదక్షిణ మొదలుపెట్టక ముందే తొలిపావంచాకు చేరుకోవడానికే భక్తులు సుమారు ఐదు కిలోమీటర్లు నడవాల్సి వచ్చింది. రాత్రంతా 32 కిలోమీటర్లు నడిచి.. గురువారం ఉదయానికి తొలిపావంచాకు చేరుకున్న భక్తులకు మళ్లీ ఇబ్బందులు ఎదురయ్యాయి. తిరుగు ప్రయాణంలోనైనా తొలిపావంచా నుంచి రవాణా సౌకర్యం అందుబాటులో ఉంటుందని భావించిన భక్తులకు నిరాశే ఎదురైంది. తమ వాహనాల వద్దకు చేరుకోవడానికి ఎలాంటి రవాణా సౌకర్యం అందుబాటులో లేకపోవడంతో.. తీవ్రమైన అలసట, భగభగమండే ఎండలో విలవిలలాడుతూనే తిరిగి గోపాలపట్నం, వేపగుంట వరకు నడిచారు. ఈ స్వల్ప దూరం నడవడానికి కొందరికి రెండు మూడు గంటల సమయం పట్టింది. అంటే అసలు గిరి ప్రదక్షిణ మార్గం 32 కిలోమీటర్లు అయితే.. ట్రాఫిక్ ఆంక్షల వల్ల భక్తులు అదనంగా మరో 10 కిలోమీటర్లు నడవాల్సి వచ్చింది. 'పుణ్య యాత్రకు వస్తే అధికారులు మాకు నరకం చూపించారు. 32 కిలోమీటర్ల ప్రదక్షిణ కాస్తా 42 కిలోమీటర్లుగా మారింది' అని పలువురు భక్తులు ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి తోడు గిరి ప్రదక్షిణకు వచ్చే, వెళ్లే భక్తులతో గోశాల జంక్షన్ కిక్కిరిసిపోయి, గంటల తరబడి ట్రాఫిక్ స్తంభించిపోయింది. మొత్తంమీద ఈ ఏడాది పోలీసులు గిరి ప్రదక్షిణ భక్తులకు చుక్కలు చూపించారు.

ప్రత్యామ్నాయం చూపాలి



నేను గిరి ప్రదక్షిణ చేయడానికి బుధవారం మాధవధార నుంచి వచ్చాను. వేపగుంటలో మేము వచ్చిన వాహనం నిలిపివేయడంతో అక్కడి నుంచి తొలి పావంచాకి దాదాపు నాలుగు కిలోమీటర్లు నడిచాను. 32 కిలోమీటర్ల ప్రదక్షిణ పూర్తి చేసుకుని తిరిగి పయనం అవుదామంటే తొలి పావంచా నుంచి ఎలాంటి రవాణా సదుపాయం కల్పించ లేదు. వాహనాల వద్దకు చేరుకునేందుకు ఇబ్బందులు పడ్డాం. వచ్చే ఏడాదైనా అధికారులు ప్రత్యామ్నాయం ఆలోచించాలి. - లక్ష్మి, మాధవధార

రవాణా సదుపాయం లేక ఇబ్బంది పడ్డా..



నేను అచ్యుతాపురం నుంచి బుధవారం గిరి ప్రదక్షిణకు వచ్చా. వేపగుంటలో ఆటో ఆపేశారు. అక్కడి నుంచి సింహాచలం వరకు నడిచా. ఇప్పుడు ప్రదక్షిణ పూర్తి చేసి మళ్లీ వేపగుంట వరకు నడవాల్సి వస్తోంది. ఎలాంటి రవాణా సదుపాయం అందుబాటులో లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నాం. - గంటాలమ్మ, అచ్యుతాపురం

వచ్చే ఏడాదైనా చర్యలు చేపట్టాలి



గిరి ప్రదక్షిణ పూర్తి చేసుకుని తొలిపావంచా నుంచి ఇంటికి వెళ్దామంటే రవాణా సదుపాయం అందుబాటులో లేదు. బుధవారం సింహాచలం చేరుకునేందుకు వేపగుంట నుంచి నడిచాను. తిరిగి వెళ్లేటప్పుడు కూడా నడవాల్సి వస్తోంది. తిరుగు పయనం అయ్యే భక్తుల కోసం వాహన సదుపాయం కల్పిస్తే బాగుంటుంది. వచ్చే ఏడాదైనా తగిన చర్యలు చేపట్టాలి. - భారతి, కంచరపాలెం

చంద్రబాబు పాలనలో ప్రజాస్వామ్యం ఖూనీ

- మాజీ సీఎం జగన్‌కు భద్రత కల్పించడంలో ప్రభుత్వం విఫలం
- రైతు సమస్యలపై పోరాడే ప్రతిపక్షాన్ని గొంతు నొక్కే ప్రయత్నం చేస్తారా?
- కొన్ని మీడియా సంస్థలు జగన్ పర్యటనను వక్రీకరిస్తున్నాయి
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు మండిపాటు



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు. చిత్రంలో పార్టీ నేతలు

సాక్షి, విశాఖపట్నం: రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని సీఎం చంద్రబాబు ఖూనీ చేస్తున్నారని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు మండిపడ్డారు. చిత్తూరు జిల్లా బంగారుపాళ్యంలో రైతుల సమస్యలను తెలుసుకోవడానికి వెళ్లిన మాజీ సీఎం, 40 శాతం ఓటింగ్ ఉన్న రాజకీయ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి భద్రత కల్పించడంలో కూటమి ప్రభుత్వం ఘోర వైఫల్యం చెందిందన్నారు. ఆయన పర్యటనను అడుగడుగునా అడ్డుకునే ప్రయత్నాలు జరిగాయన్నారు. రైతులపై పోలీసులు లాఠీఛార్జీ చేసి శాంతిభద్రతలకు విఘాతం కలిగించాలని చూశారని ఆరోపించారు. గురువారం మద్దిలపాలెంలోని పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. మామిడి, పొగాకు రైతులు గిట్టుబాటు ధర లేక ఇబ్బందులు పడుతుంటే అక్కడకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెళ్లకుండా అడ్డుకుంటూ కూటమి ప్రభుత్వం నియంతలా వ్యవహరించిందన్నారు. ఇదే కొనసాగితే ప్రభుత్వంపై, పోలీసులపై ప్రజలు తిరగబడే రోజు అతి త్వరలో వస్తుందన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంట లక్షలాది మంది కార్యకర్తలు, అభిమానులు, రైతులు, ప్రజలు నడవడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. రైతులకు అండగా నిలవడానికి వెళితే పచ్చ పత్రికల్లో మామిడి పండ్ల సీజన్ అయిపోయాక ఎందుకు వెళ్లడమంటూ ఎగతాళిగా కథనాలు రాశారన్నారు. అయితే మంత్రి అచ్చెన్నాయుడు ఈ నెల 8న కేంద్ర మంత్రులను కలిసి మామిడి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని ఎందుకు కోరారని ప్రశ్నించారు. రైతులకు అన్యాయం చేసే ఈ ప్రభుత్వాన్ని జాకీలు పెట్టి పైకెత్తడానికే పచ్చ మీడియా చానళ్లు, పత్రికలు ఉన్నాయంటూ మండిపడ్డారు. వైఎస్ జగన్ పర్యటనను వక్రీకరించి చూపించే బదులు రైతు సమస్యలు చూపిస్తే వారికి మంచి జరుగుతుందన్నారు. చంద్రబాబు పోలీసు వ్యవస్థను అడ్డుపెట్టుకొని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అణగదొక్కే ప్రయత్నం చేస్తున్నారని, దీనిని రాష్ట్ర ప్రజానీకం గమనిస్తోందన్నారు.

- రాష్ట్రంలో డ్రగ్స్, గంజాయి విచ్చలవిడిగా లభ్యమవుతున్నా.. అదేమిలేనట్లు ఈనాడు పత్రిక కథనాలు ప్రచురిస్తోందని కె.కె.రాజు మండిపడ్డారు. ఈనాడు కథనం ప్రచురించిన రెండు రోజుల్లోనే విశాఖలో సుమారు 1000 కిలోల గంజాయి దొరికిందన్నారు. కార్యక్రమంలో తూర్పు సమన్వయకర్త మొల్లి అప్పారావు, డిప్యూటీ మేయర్ సతీష్, పార్టీ కార్యాలయ పర్యవేక్షకుడు రవిరెడ్డి, జిల్లా అనుబంధ సంఘాల అధ్యక్షులు పేడాడ రమణి కుమారి, బోని శివరామకృష్ణ, మార్కండేయులు, కరణం కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు చర్యలతోనే వ్యాధుల కట్టడి

అధికారులతో కలెక్టర్ హరేందిర ప్రసాద్

మహారాణిపేట: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, అన్ని చోట్లా ఫాగింగ్ చేయాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్ ఆదేశించారు. స్వర్ణాంధ్ర పి-4 ఫౌండేషన్, పాజిటివ్ పబ్లిక్ పెర్సెప్షన్, రిలయన్స్ కంప్రెస్డ్ బయోగ్యాస్ యూనిట్లు, సీజనల్ వ్యాధుల నియంత్రణకు చర్యలు, వివిధ సంక్షేమ వసతి గృహాల నిర్వహణ తదితర అంశాలపై గురువారం రాష్ట్ర సచివాలయం నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా కలెక్టరేట్ వీసీ హాలు నుంచి వర్చువల్‌గా పాల్గొన్న కలెక్టర్ జిల్లాకు సంబంధించిన అంశాలను వివరించారు. అనంతరం వీసీ అధికారులతో మాట్లాడుతూ వివిధ అంశాలపై చేపట్టాల్సిన చర్యల గురించి సూచనలు చేశారు. అన్ని వసతి గృహాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని, పారిశుధ్య చర్యలు పక్కాగా చేపట్టాలని సూచించారు. దోమల నివారణలో భాగంగా వీధులు, ప్రధాన ప్రాంతాలు, వసతి గృహాలు, అపార్టుమెంట్ల వద్ద క్రమం తప్పకుండా ఫాగింగ్ చేయాలని చెప్పారు. వసతి గృహ విద్యార్థుల ఆరోగ్య సంరక్షణకు చర్యలు చేపట్టాలని, షెడ్యూల్ ప్రకారం వైద్య సిబ్బంది వసతి గృహాలకు వెళ్లి వైద్య పరీక్షలు చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీపీవో కె. శ్రీనివాసరావు, జిల్లా పరిశ్రమల కేంద్రం జీఎం ఆదిశేషు, డీఎంహెచ్‌వో డాక్టర్ పి. జగదీశ్వరరావు, సాంఘిక సంక్షేమ శాఖ డి.డి. కె. రామారావు, సీఎంవో నరేష్ కుమార్, విభిన్న ప్రతిభావంతుల శాఖ ఏడీ కవిత, జిల్లా మలేరియా నివారణ అధికారి తులసి, బీసీ, గిరిజన సంక్షేమ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

'పీటీఎం' బహిష్కరించిన తల్లిదండ్రులు



కంచరపాలెం ప్రాథమిక పాఠశాలలో పీటీఎంను బహిష్కరిస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు, మాజీ కార్పొరేటర్ బొట్టా ఈశ్వరమ్మ

కంచరపాలెం: జీవీఎంసీ 56వ వార్డు కంచరపాలెం ప్రాథమిక పాఠశాలలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన మెగా పేరెంట్ టీచర్ 2.0 ఆత్మీయ సమావేశాన్ని తల్లిదండ్రులు బహిష్కరించారు. గత నెలలో పాఠశాలను మూసివేసేందుకు అధికారులు ప్రయత్నించగా, విద్యార్థుల తల్లిదండ్రులు అడ్డుకుని ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహించారు. జిల్లా విద్యాశాఖాధికారులు సమస్యను పరిష్కరించకపోవడంతో, ఉన్న నలుగురు ఉపాధ్యాయులతోనే పాఠశాల కొనసాగుతోంది. ఈలోగా కొంతమంది తల్లిదండ్రులు ఇతర పాఠశాలల్లో తమ పిల్లలను చేర్పించారు. గురువారం జరిగిన పేరెంట్ మీట్‌కు ప్రజాప్రతినిధులు, అధికారులు వస్తారనే ఉద్దేశంతో, వార్డు మాజీ కార్పొరేటర్ బొట్టా ఈశ్వరమ్మ నేతృత్వంలో తల్లిదండ్రులు పాఠశాలకు చేరుకుని నిరసన తెలిపారు. పాఠశాలను తరలిస్తే ఉద్యమం చేపడతామని హెచ్చరించిన ఈశ్వరమ్మ.. రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలలు మూతబడేలా చేసి మెగా పేరెంట్ మీట్‌లతో పండగ చేసుకుంటుందని ఆరోపించారు. పేరెంట్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పోలీస్ సేవలు భేష్

- 200 మంది గిరి భక్తులను వారి కుటుంబ సభ్యుల చెంతకు చేర్చారు
- డీసీపీ-2 మేరీ ప్రశాంతి



వివరాలు వెల్లడిస్తున్న శాంతి భద్రతల డీసీపీ-2 మేరీ ప్రశాంతి

అల్లిపురం: సింహాచలం గిరి ప్రదక్షిణలో నగర పోలీసులతో పాటు జిల్లాలో ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన పోలీసుల సేవలు మెచ్చుకోదగినవని శాంతిభద్రతల డీసీపీ-2 మేరీ ప్రశాంతి అన్నారు. గురువారం సాయంత్రం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరులు సమావేశంలో ఆమె మాట్లాడారు. గిరి ప్రదక్షిణకు రాష్ట్రంతో పాటు ఒడిశా, తమిళనాడు, జార్కండ్, ఛత్తీస్‌గఢ్ వంటి రాష్ట్రాల నుంచి కూడా అనేక మంది భక్తులు 32 కిలోమీటర్లు భక్తి శ్రద్ధలతో గిరి ప్రదక్షిణ చేశారన్నారు. అనేక మంది భక్తులు తమ బంధువులు, స్నేహితుల నుంచి తప్పిపోయారన్నారు. ఈ నేపథ్యంలో పోలీస్ కమిషనర్ ప్రత్యేక శ్రద్ధతో కమాండ్ కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసి తప్పిపోయిన వారిని వారి కుటుంబ సభ్యుల చెంతకు చేర్చారన్నారు. పలు రకాల భాషల వారు గిరి ప్రదక్షిణకు రావటంతో ఆ భాషలు తెలిసిన కానిస్టేబుళ్లను ఏర్పాటు చేసి సేవలు అందించామన్నారు. ఈ సందర్భంగా పలువురు భక్తులు నగర పోలీసుల సేవలను అభినందించారన్నారు. మునుపెన్నడూ లేని విధంగా పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి ఆధ్వర్యంలో గిరి ప్రదక్షిణను సిటీ పోలీసులు విజయవంతంగా నిర్వహించారని ఆమె తెలిపారు.

అప్పన్న ఆలయంలో ఘనంగా ఢిల్లీ విజయోత్సవం



భగవత్ రామానుజాచార్యులు



భగవత్ రామానుజాచార్యులకు బేడామండపంలో తిరువీధి నిర్వహిస్తున్న అర్చకులు

స్వామికి శాస్త్రోక్తంగా తుది విడత చందన సమర్పణ

సింహాచలం: ఆషాఢ పౌర్ణమిని పురస్కరించుకుని సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో గురువారం ఢిల్లీ విజయం ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విశిష్టాద్వైత స్థాపకులు భగవత్ రామానుజాచార్యులు తన పాండిత్యంతో ఢిల్లీ బాద్‌షాని మెప్పించిన రోజు ఆషాఢ పౌర్ణమి కావడంతో, ఏటా ఆరోజు శ్రీవైష్ణవ ఆలయాల్లో ఢిల్లీ విజయం ఉత్సవాన్ని నిర్వహిస్తుంటారు. దీనిలో భాగంగా ఆలయంలోని భగవత్ రామానుజాచార్యులు ఉత్సమూర్తిని విశేషంగా అలంకరించి సాయంత్రం ఆలయ బేడామండపంలో ఉన్న హంసమూలన కొలుదీర్చారు. ఆయన వైభవాన్ని కీర్తిస్తూ వైభవపారాయణ విన్నపం చేశారు. అనంతరం పల్లకిలో బేడా తిరువీధి ఘనంగా నిర్వహించారు. ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకుడు కరి సీతారామాచార్యులు, ఉప ప్రధానార్చకుడు కె.కె.ప్రసాదాచార్యులు, అర్చకులు ఈ కార్యక్రమాన్ని జరిపారు.

తుది విడత చందన సమర్పణ

ఆషాఢ పౌర్ణమిని పురస్కరించుకుని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం తుదివిడత చందన సమర్పణ శాస్త్రోక్తంగా జరిగింది. తెల్లవారుజామున ఒంటి గంటకు స్వామిని మేల్కొలిపి సుప్రభాతసేవ చేశారు. తర్వాత ఆలయ భాండాగారంలో భద్రపరిచిన మూడు మణుగుల పచ్చిచందనాన్ని తీసుకొచ్చి స్వామికి సమర్పించారు. అనంతరం ఆరాధన, బాలభోగం, రాజభోగం నిర్వహించారు. దీంతో ఈ ఏడాది నాలుగు విడతల చందన సమర్పణ పూర్తయింది.

ద్విచక్ర వాహనం అదుపు తప్పి నేవీ ఉద్యోగి మృతి



అమిత్‌కుమార్ (ఫైల్)

మర్రిపాలెం: బీఆర్‌టీఎస్ రహదారిలో ద్విచక్ర వాహనం వా అదుపు తప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొనడంతో నేవీ ఉద్యోగి మృతి చెందిన ఘటన కంచరపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన అమిత్‌కుమార్ విశాఖ నేవీలో జూనియర్ కమిషన్డ్ ఆఫీసర్‌గా విధులు నిర్వర్తిస్తూ 104 ఏరియా నవశక్తినగర్‌లో నివాసముంటున్నాడు. అతను బుధవారం అర్ధరాత్రి కంచరపాలెం నుంచి తాను ఉంటున్న 104 ఏరియాకు వస్తున్న క్రమంలో కేంద్రీయ విద్యాలయం వద్ద అతడు నడుపుతున్న బైక్ అదుపు తప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొనడంతో తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ప్రస్తుతం మృతదేహం కేజీహెచ్ మార్చురీలో భద్రపరిచారు. మృతుడి బంధువులు రాజస్థాన్ నుంచి వచ్చి వివరాలు తెలిపారు. శుక్రవారం పోస్ట్‌మార్టం అనంతరం మృదేహాన్ని వారికి అప్పజెప్తామని పోలీసులు తెలిపారు. మరణించిన వ్యక్తికి భార్య మనీషా, కుమార్తె ఉన్నారు. ఇదిలా ఉండగా పోలీసులు ప్రమాద స్థలిలో మృతుని సెల్‌ఫోన్ ఆధారంగా అతడి వివరాలు సేకరించే ప్రయత్నం చేశారు.

ఏయూను సందర్శించిన ఐసాయ్ ప్రతినిధులు



ఏయూ వీసీతో సమావేశంలో పాల్గొన్న ఐసాయ్ ప్రతినిధులు

మద్దిలపాలెం: ఐసాయ్(ఈఐఎస్ఏఐ) గ్లోబల్ చీఫ్ ఇన్నర్వేషన్ ఆఫీసర్(టోక్యో) మకోటో హొకెట్సు, ఇతర ప్రతినిధులు ఏయూను గురువారం సందర్శించారు. వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్‌ను కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. వివిధ విభాగాల ఆచార్యులతో సమావేశమై పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఐసాయ్ ప్రతినిధులు మాట్లాడుతూ విశాఖలో గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్(జీసీసీ) నెలకొల్పే ఆలోచనలో ఉన్నట్లు తెలిపారు. దీనికి రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహాయ సహకారాలు అందిస్తుండటంపై ఆనందం వ్యక్తం చేశారు. వీసీ మాట్లాడుతూ విశాఖ నగరం అన్ని విధాలా జీసీసీకి అనుకూలమన్నారు. ఏయూ తరఫున ఒక కోఆర్డినేటర్‌ను నియమిస్తామని తెలిపారు. ఇంటర్న్‌షిప్ కార్యక్రమాలు నిర్వహించేందుకు కార్యాచరణ రూపొందిస్తామన్నారు. సమావేశంలో ఐసాయ్ మేనేజింగ్ డైరెక్టర్ కియో టోడా, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ గిరీష్ దీక్షిత్, సంస్థ తరఫున ఐటీ ఇండియా హెడ్ జోసఫ్ కిరణ్ కుమార్, ఆచార్య శశి, డీన్ ఔట్రీచ్ ఆచార్య కె.రమసుధ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఇన్‌చార్జి మంత్రి రాక

మహారాణిపేట : జిల్లా ఇన్‌చార్జి మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి శుక్రవారం విశాఖ వస్తున్నారు. ఉదయం 10 నుంచి ఒంటి గంట వరకు ఏపీ స్టడీ సర్కిల్ సందర్శిస్తారు. మధ్యాహ్నం 3 గంటలకు కలెక్టరేట్‌లో పి4 సమావేశంలో పాల్గొంటారు. రాత్రికి విశాఖపట్నంలో బస చేస్తారు. 12వ తేదీ ఉదయం 9.30 గంటలకు పార్వతీపురం చేరుకొని అధికారులతో సమీక్ష చేస్తారు.

రోడ్డు ప్రమాదంలో బీటెక్ విద్యార్థి దుర్మరణం

తగరపువలస : ఆనందపురం మండలం శొంఠ్యాం వద్ద గురువారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో అనకాపల్లి జిల్లా వి.మాడుగులకు చెందిన నందారపు ఉమా పవన్(19) అనే బీటెక్ విద్యార్థి దుర్మరణం చెందాడు. ఆనందపురం ఎస్ఐ జి.సంతోష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నా ఉన్నాయి. పవన్ చెరకుపల్లి అవంతి ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. బుధవారం సాయంత్రం ముగ్గురు స్నేహితులతో కలిసి సింహాచలం గిరి ప్రదక్షిణకు వెళ్లాడు. తిరిగి స్నేహితులతో వచ్చే క్రమంలో గురువారం అడవివరం నుంచి ఆటో ఎక్కారు. ఆటో డ్రైవర్ వేగంగా, నిర్లక్ష్యంగా నడుపుతూ కుడివైపు ఫుట్‌పాత్ ఎక్కించాడు. దీంతో ఆటో బోల్తా పడింది. ప్రమాదంలో ఆటోలో ఎడమవైపు కూర్చున్న పవన్ రోడ్డుపై పడిపోవడంతో తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని తండ్రి రాము ఫిర్యాదు మేరకు ఆనందపురం ఎస్ఐ సంతోష్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమిలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇసుకకొండకు పోటెత్తిన భక్తులు



ఇసుక కొండ సత్యనారాయణ స్వామి ఆలయం క్యూలైన్‌లో భక్తులు

దాబాగార్డెన్స్ : నగరంలోని ఇసుకకొండ (బాబాజీకొండ)పై వెలసిన రమా సహిత సత్యనారాయణస్వామి ఆలయం గురువారం భక్తులతో పోటెత్తింది. ఆషాఢ పౌర్ణమి (గురు పౌర్ణమి) సందర్భంగా పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. జిల్లా నలుమూలల నుంచే కాక ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి భక్తులు సత్యదేవుని ఆలయానికి పోటెత్తారు. వేకువ జాము 2 గంటల నుంచే క్యూలైన్లు బారులు తీరాయి. అనివెట్టి మండపం వద్ద భక్తులు దీపాలు వెలిగించారు. పెద్ద ఎత్తున సామూహిక వ్రతాలు జరిగాయి. ఉచిత, రూ.20, రూ.200 దర్శనాలు ఏర్పాటు చేశారు. పలువురు ప్రముఖులు స్వామివారిని దర్శించుకున్నారు. స్వామి దర్శనానికి విచ్చేసిన భక్తుల సౌకర్యాలను ఆలయ ఈవో టి. రాజగోపాల్‌రెడ్డి పర్యవేక్షించారు. వన్‌టౌన్ పోలీసులు, వివిధ దేవాలయాల సిబ్బంది సేవలందించారు. మధ్యాహ్నం వరకు దర్శనాలు జరిగాయి.

చికెన్ ధరలు



చికెన్ (కిలో) (వెన్‌కాబ్)	
బ్రాయిలర్ (లైవ్)	: రూ.95
స్కిన్	: రూ.160
స్కిన్‌లెస్	: రూ.170

కోడిగుడ్ల ధరలు

	రూ.లలో (వందకు)
విశాఖ	540.00
విజయనగరం	544.00
శ్రీకాకుళం	544.00

వలకు చిక్కిన భారీ చేపలు







మత్స్యకారుల పంట పండింది. వారి వలలకు భారీ చేపలు చిక్కాయి. కొమ్ము కోనాం, ట్యూనా చేపలు పెద్ద సంఖ్యలో లభించాయి. దీంతో సాయంత్రం ఫిషింగ్ హార్బర్‌లో సందడి నెలకొంది. కొంత మంది వాటికి అక్కడే వేలం నిర్వహించగా.. మరికొందరు ఎగుమతులకు సిద్ధం చేసుకున్నారు. - సాక్షి ఫొటోగ్రాఫర్